క్లుప్తంగా

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎంఈఓ

బీకేపాలెం(కాకుమాను): విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తెలిపారు. మండలంలోని బీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారు విద్యలో రాణించే విధంగా కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పని తీరు, మధ్యాహ్న భోజన అమలు తదితర అంశాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

గుంటూరు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గజిట్ ప్రకారం కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచుతామని చెప్పి పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 నుంచి సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు నామతోటి రాణి, మందా రాజేష్, ఎం.పద్మ, సుబ్బాయమ్మ, సుమలత, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయంపై హర్షం

నెహ్రూనగర్: రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న తొమ్మిది ఎమ్మెల్సీ స్థానాల్లో 50 శాతం బీసీలకు కేటాయిస్తానని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై తొగట వీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగట వీర క్షత్రియులు, వారి సోదరులైన దేవాంగ, పద్మశాలీ, కర్ణాబత్తుల వంటి 18 కులాల చేనేతలు మొత్తం కలిపి రాష్ట్ర జనాభాలో 19 శాతం ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం చేనేతలకు రెండు ఎమ్మెల్సీలు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కోటేశ్వరరావు, మార్కండేయులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి, శ్రీనివాసరావు, చౌడేశ్వరి పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులపై ఇంటర్ విద్యార్థులకు అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో అందిస్తున్న వివిధ కోర్సులపై ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగిన డిగ్రీ కోర్సుల దిశగా విద్యార్థినులు అవగాహన పెంచుకుని, ప్రవేశం పొందాలని సూచించారు. వివిధ విభాగాధిపతులు ఆయా విభాగాల వారీగా ఉద్యోగావకాశాల్ని వివరించారు.

భక్తుల పెన్నిధి క్వారీ బాలకోటేశ్వరుడు

- మహాశివరాత్రికి ఆలయం సిద్ధం
- తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు

చేబ్రోలు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంది. రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత చెప్పుకోదగిన చేబ్రోలు వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా ఇక్కడ విరాజిల్లుతున్నాడు. సుమారు వందేళ్ల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం వద్ద సుమారు 80 ఏళ్ల నుంచి తిరునాళ్ల జరుగుతోంది. మొట్టమొదటిసారిగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకువచ్చినట్లు సమాచారం.


క్వారీ బాలకోటేశ్వరస్వామి

తిరునాళ్ల నేపథ్యం

1920లో చీమకుర్తి యలమందయ్య వడ్లమూడిలో పొలం దున్నుతుండగా శివలింగం బయట పడింది. ఆయన అక్కడే ప్రతిష్ఠించి పూజలు చేశారు. గ్రామంలో అరిష్టాలు జరగడానికి కారణం విగ్రహానికి పూజల్ని నిర్లక్ష్యం చేయడమేనని స్థానికులు భావించారు. ఓ రోజు బాలకోటేశ్వరస్వామి యలమందయ్యకు కలలో కనిపించి తనకు గుడి నిర్మించి పూజలు చేయాలని ఆజ్ఞాపించాడు. దీంతో ఆయన పొలంలో లభించిన శివలింగానికి గుడి కట్టించి, పూజలు చేస్తూ దేవుని సేవలో నిమగ్నమైనాడు. మొట్టమొదటి సారిగా మండలంలోని గొడవర్రు గ్రామస్థులు ప్రభను ఏర్పాటు చేసి తిరునాళ్లకు తీసుకువచ్చారు. దీని దృష్ట్యా అప్పటి నుంచి ఇప్పటి వరకు గొడివర్రు గ్రామ ప్రభ మహాశివరాత్రికి ముందు వరసలో ఉంటుంది. ఈ సందర్భంగా జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి లక్షమంది భక్తులు హాజరవుతారు. ఆలయ ధర్మకర్త యలమందయ్య కోర్కెపై మరణానంతరం ఆయన మృతదేహాన్ని ఆలయానికి ఆగ్నేయ దిశలో తెనాలి రోడ్డు పక్కనే సమాధి చేశారు. కాలక్రమేణా భక్తుల రాకపెరగడంతో ఆలయం అభివృద్ధి చెందింది. సూర్యదేవర వెంకటప్పయ్య నిజాం పట్టణం మండలం నక్షత్ర నగర్‌లో ఎకరం భూమిని ఆలయ నిర్వహణకు రాశారు. జిల్లాలో వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఆదరణ, గుర్తింపు లభించడంతో అధికారులు ఈ ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేశారు. ఏటా తిరునాళ్లకు జిల్లా నలుమూల నుంచి లక్షమంది వరకు భక్తులు వస్తుంటారు. ఇక్కడ దేవునికి మొక్కుకుంటే కోర్కెలు తీరతాయని నమ్మకం. భారీ విద్యుత్ ప్రభలు ఈ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణ. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి, శలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాలనుంచి 12 వరకు భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న ప్రభలు తిరునాళ్లకు వస్తాయి.


దేవాలయ సమీపంలో ఆలయ ధర్మకర్త చీమకుర్తి యలమందయ్య సమాధి


నారాకోడూరు వద్ద తుది మెరుగులు దిద్దుకుంటున్న భారీ విద్యుత్ ప్రభ

దర్గా అభివృద్ధికి సహకారం అభినందనీయం

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పెదకాకాని: బాజీ బాబా దర్గా అభివృద్ధికి కెనరా బ్యాంక్ సహాయ సహకారాలు అభినందనీయమని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య కొనియాడారు. దర్గాలో జనరేటర్ ఏర్పాటుకు నగదు సహాయం చేయాలని ఇటీవల దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా బ్యాంకు పెదకాకాని బ్రాంచి అధికారుల్ని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన కెనరా బ్యాంక్ యాజమాన్యం రూ. 3,75,000 విలువైన జనరేటర్‌ను అందజేసింది. ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య శుక్రవారం ప్రారంభించారు. అధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముందుగా దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఈఓ షేక్ ముక్తార్ బాషాతో కలసి దర్గాలో అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ పెదకాకాని మేనేజర్ కవిత, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ షహనాజ్, మండల కో– ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, జిల్లా మైనార్టీ చైర్మన్ షేక్ జిలాని, డైరెక్టర్ సయ్యద్ సుబాని పాల్గొన్నారు.


జనరేటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, బ్యాంకు అధికారులు

కళాతపస్వి విశ్వనాథ్‌కు స్వరాంజలి

పెదకాకాని: కళాతపస్వి, దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత కె. విశ్వనాథ్‌కు శుక్రవారం నంబూరు వివా వీవీఐటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయబద్ధమైన సంగీతానికి, శాస్త్రీయ కళలకు, సంస్కృతి, సంప్రదాయాలకు తెలుగు సినిమాలలో పెద్దపీట వేసి గుర్తింపు తెచ్చారని పలవురు కొనియాడారు. పాఠశాల మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన దర్శకత్వం వహించిన సినిమాల్లోని గీతాల్ని సభ్యులు రాజేంద్ర, వసంత, లక్ష్మీలత, విద్యార్థులు రేవతి, సంహిత ప్రదర్శించారు.


విశ్వనాథ్‌కు నివాళులర్పిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి

గుంటూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో నేతలు

గుంటూరు రూరల్: మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుకునేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పులగం దివ్య పేర్కొన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో శోభారాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్య ఉన్న గ్రామాల్లో వెంటనే ప్రణాళికలు సిద్ధం చేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. పొదుపు సంఘాల మహిళలు రుణాలు పొందడంలో అవస్థలు పడుతున్నారని, యానిమేటర్ల చేతివాటంపై ఆరోపణలు, ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని పరిష్కరించి మహిళల ఇబ్బందులు తీర్చాలని చెప్పారు. ఎంపీపీ పులగం దివ్య మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ఇప్పటికే ప్రారంభించి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభించని వాటిని వెంటనే మొదలెట్టాలని సూచించారు. అనంతరం మండల స్థాయిలోని పలు విభాగాల అధికారులు గత సమావేశం నుంచి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం చేయాల్సిన పనుల్ని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయ, తదితర రంగాల్లోని రాయితీల్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి, దర్శి సుజాత, ఎంపీటీసీ సభ్యులు కాకాని రమేష్, ఉడతా భూలక్ష్మి, పులిమి నాగరాజు, సర్పంచులు, గ్రామాల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర దిగుబడులు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయంతోపాటు ఆరోగ్యకరమైన పంటల్ని రైతులు పండించవచ్చని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. వెంకటనాయుడు తెలిపారు. నగర శివారుల్లోని లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విస్తరణ సంచాలకుడు మాట్లాడుతూ నిరంతరమైన సుస్థిరమైన వ్యవసాయాన్ని ఒక ప్రత్యామ్నాయంగా రైతులు మలుచుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో మట్టి, సహజ వనరుల వినియోగం, పంటల సాగు విధానం, నీటి, వాయుకాలుష్యం, తదితర విషయాలను వివరించారు. కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూమి, వాయు, వాతావరణ కాలుష్యంతో పాటు ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన సామగ్రి, జీవన ఎరువుల్ని రైతులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. గంగాదేవి, డాక్టర్ అనిల్, డాక్టర్ దీప, డాక్టర్ అర్చనతో పాటు 112 మంది రైతులు, మూడు జిల్లాల రైతు సాధికార సంస్థ, ఏపీసీఎంఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.


రైతులకు జీవన ఎరువులను పంపిణీ చేస్తున్న వెంకటనాయుడు తదితరులు

నేడు మహారుద్రాభిషేకం

గుంటూరు రూరల్: నగర శివారు నల్లపాడు రోడ్డులోని రెడ్డి కాలేజీ సమీప గ్రౌండ్‌లో శనివారం మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం నిర్వహిస్తున్నట్లు వేమవరం కోటిలింగాల క్షేత్రం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు మూడు టన్నుల మట్టితో, ఏడు అడుగుల ఎత్తుగల శివలింగాన్ని అభిషేకిస్తారని పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 6.45 గంటల నుంచి 7.55 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులుకావాలని వారు కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో వి. సుజాతాదేవి తెలిపారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై శుక్రవారం బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుజాతాదేవి మాట్లాడుతూ పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులు ఇంటర్, డిగ్రీ కూడా చదువుకోవాలని సూచించారు. ఇంట్లోనే ఉంటూ కళాశాల చదువులు చదువుకునే అవకాశం ఉందని, వాటి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థి వయస్సులోనే తల్లిదండ్రులు వివాహం చేసేందుకు నిర్ణయిస్తే అభ్యంతరం తెలియజేయాలన్నారు. అయినప్పటికీ వారు మాట వినకుంటే టోల్ ఫ్రీ నంబర్ 1098 గానీ 100కు లేదా 181 ఫోన్ నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాల్ని గోప్యంగా ఉంచి, వివాహాన్ని ఐసీడీయస్, పోలీస్ శాఖ అధికారులు నిలుపుదల చేస్తారని తెలిపారు. బాలికలకు 18సంవత్సరాలు, బాలురకు 21సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదని తల్లిదండ్రులకు తెలిపారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం జరిగితే అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మహిళా కార్యదర్శి యన్. కోమలి, ప్రధానోపాధ్యాయురాలు డి. నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్. రఘుకుమారి, జి. నాగలక్ష్మి పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుజాతాదేవి

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు శిశు అభివృద్ధి పథకపు అధికారి వి. సుజాతాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ ప్రకారం ప్రత్తిపాడు మండలం యనమదల శివాలయం సెంటర్ ఆయా పోస్టు ఓసీ జనరల్ కేటగిరీకి, వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు సెంటర్ పోస్టు ఎస్సీకి రిజర్వు అయినట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు. దరఖాస్తుదారులు 2022 జులై ఒకటో తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వయస్సుతో పాటు స్థానిక నివాసంతో పాటు వివాహిత అయ్యి ఉండాలని సూచించారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సీడీపీవో కోరారు.

విద్యతోనే మహిళా సాధికారత సాధన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే మహిళా సాధికారత సాధన సాధ్యమని యువజన సర్వీసుల శాఖ–స్టెప్ సీఈవో ఎస్.పల్లవి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం మహిళా రక్షణ–స్వావలంబనపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ–నెహ్రూ యువకేంద్ర, గుంటూరు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్లవి మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడంతో హక్కుల గురించి అవగాహన లభిస్తుందని తెలిపారు. ఎన్నుకున్న వృత్తిలో రాణించేందుకు, స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనలోనూ ఆర్థికంగా, స్వతంత్రంగా ఉండేందుకు విద్య దోహదం చేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరు భేటీ బచావో అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని వారి విద్యకు పూర్తి సహకరించాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యంతో పాటు స్వయంగా జీవించే శక్తి కోసం మహిళలంతా పాటుపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ జీవితాన్ని ఎంచుకున్న విధంగా జీవించడం మన హక్కుఅని, ప్రతి బాలిక, మహిళ దీన్ని గ్రహించడంలో సహాయం చేయడమే మహిళా–సాధికారత కార్యకలాపాల లక్ష్యం అని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళా రక్షణ, ఆర్థిక స్వావలంబనపై నిర్వహించిన ఉపన్యాస, డ్రాయింగ్ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలోఎస్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.సంతోష్‌కుమారి, స్టెప్ మేనేజర్ బి.రాధిక, దిశా వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె.శాంతి, ఎస్ఎస్ఎస్ అధికారులు ఎం. శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.


విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో స్టెప్ సీఈవో పల్లవి, వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు

సెమీ సాలిడ్ డోసెజ్ ఫామ్‌తో పలు ఉపయోగాలు

గుంటూరు రూరల్: సెమీ సాలిడ్ డోసెజ్ ఫామ్స్ సహాయంతో రోగ లక్షణాల్ని తగ్గించి చికిత్స చేయడానికి, రోగిని హానికరమైన పరిస్థితి నుంచి కాపాడేందుకు ఉపయోగిస్తారని చైనాకు చెందిన జూజాంగ్ క్సియాంజు ఫార్మాస్యూటికల్స్ ఎఫ్ఆర్ఎండీ డైరెక్టర్ బి. భవానీ ప్రసన్నకుమార్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నావెల్ అడ్వాన్స్‌సెస్ ఇన్ ఫార్ములేషన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆస్పెక్ట్ ఆఫ్ సెమి సాలిడ్ డోసెజ్ ఫామ్స్ అనే అంశంపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సెమిసాలిడ్ డోసెజ్ ఫామ్స్ ఔషధాలను సాధారణంగా రోగికి ముక్కు, చర్మం ద్వారా ఉపయోగిస్తారని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడతూ సెమీ సాలిడ్ డోసెజ్ ఫామ్ ప్రాముఖ్యత, చర్మం పాత్ర, ఉపయోగాలు, అనంతరం కలిగే లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈ– పేపర్ ప్రజంటేషన్ పోటీల్ని నిర్వహించి బహుమతులు అందజేశారు. చివరగా అతిథుల్ని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి. ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు ఘనంగా సన్మానించారు.


అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సైడు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గం 17వ డివిజన్ ఎల్ఆర్ కాలనీ, గాంధీనగర్‌లో రూ 1.20 కోట్లతో నిర్మించనున్న సైడు కాల్వల నిర్మాణాలకు శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫర్జానా, వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరిఫాతిమా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజల సౌకర్యార్థం సైడు కాల్వల నిర్మాణాల్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యాదాల చిన్న, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, వేముల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గోపీనాయుడు, అంగడి పిచ్చయ్య, మస్తాన్‌వలి, మరియదాసు, అంకమ్మరావు, పద్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.